క్లుప్తంగా

రంజాన్ మాసం ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో మసీదు

ఆమనగల్లు: ముస్లింలు పవిత్రంగా జరుపుకొనే రంజాన్ మాసం.. ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ ప్రారంభం అయినట్లు మత పెద్దలు ప్రకటించారు. పండుగ నేపథ్యంలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనల కోసం మసీదులను విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ రాందాస్

మంచాల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎంఈఓ రాందాస్ కోరారు. మండలంలోని వేంకటేశ్వర తండా ప్రాథమిక పాఠశాలకు ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ సంస్థ ముందుకు వచ్చి పెయింటింగ్, గోడలపై బొమ్మలు వేయించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను శనివారం సన్మానించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. మన పిల్లల భవిష్యత్ కోసం మనమే సహకారం అందించాలని సూచించారు. దీంతో పాఠశాల అభివృద్ధితో పాటు చిన్నారులకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.డీ. జావేద్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న హెచ్ఎం

ఇబ్రహీంపట్నం: ఎలిమినేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్.. విద్యార్థులకు స్టేషనరి కిట్స్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. తోటి వారికి సహాయం చేయాలని, స్నేహభావంతో మెలగాలన్న ఆలోచన పాఠశాల స్థాయి నుంచే చిన్నారుల్లో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంతోషిని, అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత పాల్గొన్నారు.

తండాల్లో వసతుల కల్పనే లక్ష్యం

మహేశ్వరం: గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పార్టీ ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ నేనావత్ రాజునాయక్ అన్నారు. శనివారం మండల పరిధి ఉప్పుగడ్డ తండా గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న కొత్త తండాలో రూ.9.50 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక వసతులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి వసతుల కల్పన, వీధి దీపాల ఏర్పాటుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా నిధులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో నిధులు మంజూరయ్యాయని, ఆయనకు తండా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు పూర్తిగా కట్టుబడి ఉండి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరిస్తామని, ఇందుకుగాను పార్టీ నాయకులు, కార్యకర్తలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

సంత.. అసౌకర్యాల చింత

- మార్కెట్ లేక.. రోడ్లపైనే క్రయవిక్రయాలు
- వారాంతపు అంగడిపైనే ఆధారం
- కార్యరూపం దాల్చని 'ఇంటిగ్రేటెడ్'



సర్వే నంబర్ 212లో మార్కెట్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం(ఫైల్)



రోడ్డుపైనే కూరగాయల సంత

తుర్కయంజాల్: లక్షన్నరకు పైగా జనాభా కలిగిన పురపాలక సంఘం పరిధిలో నేటికీ ఒక్క కూరగాయాల మార్కెట్ లేదు. దీంతో వారాంతపు సంతే వారికి దిక్కయింది. వారానికి సరిపడా కూరగాయలను ఒకేసారి, అదీ అధిక ధరలకు కొనుగోలు చేసి, భద్రపర్చుకోవాల్సిన దుస్థితి కలిగింది.

కోర్టు కేసుతో బ్రేక్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 212లో రూ.4.5 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణానికి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆ వెంటనే కొందరు వ్యక్తులు ఈ భూమిపై కోర్టులో కేసు వేయడంతో పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు అదే సమయంలో ఇక్కడ మున్సిపల్ పాలకవర్గం కాంగ్రెస్ పార్టీ కావడంతో రాజకీయ విభేదాల వలన మార్కెట్ గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఆ తరువాత సర్వే నంబర్ 471లో మార్కెట్ నిర్మాణం చేపట్టాలని అధికారులు భావించినప్పటికీ.. కార్యరూపం దాల్చలేదు.

రోడ్లపైనే విక్రయాలు

స్థానికంగా కూరగాయల మార్కెట్ లేకపోవడంతో వారం వారం ఏర్పాటు చేసే అంగళ్లపైనే ప్రజలు ఆధారపడ్డారు. తుర్కయంజాల్, ఇంజాపూర్, రాగన్నగూడ, మునగనూర్, తొర్రూర్, కొహెడతో పాటు పలు కాలనీల్లో వారానికి ఒక్కరోజు రోడ్లకు ఇరువైపులా సంతలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమయంలో వాహనదారులు, కొనుగోలుదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రాకపోకలు, క్రయవిక్రయదారులతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. మార్కెట్ జరిగే సమయాల్లో ట్రాఫిక్ పోలీసుల జాడ కనిపించదు. ఇదే అదనుగా భావించిన దొంగలు.. రద్దీలో తమ చేతివాటానికి పని పెంచుతున్నారు. సెల్‌ఫోన్లు తదితర వాటిని చోరీ చేస్తున్నారు.

అంతర్గత రోడ్లకు ఇరువైపులా..

రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన రోడ్లపై కాకుండా, కాలనీల అంతర్గత రోడ్లకు ఇరువైపులా మార్కెట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు, పార్కు స్థలాలు, ప్రజా ప్రయోజనార్థం వదిలిన స్థలాల్లో సంతలను ఏర్పాటు చేస్తే.. ప్రాంత వాసులకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. పాలకులు, అధికారులు ఆ దిశగా ఆలోచించాలని కోరుతున్నారు.

> **మార్కెట్ నిర్మాణానికి..**
>
> స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నది వాస్తవమే. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మున్సిపాలిటీ ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదు. గతంలో ఒకటి రెండు చోట్ల అనుకున్నప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు.
>
> – భిక్షపతి, డీఈ, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

- పొంచిఉన్న ప్రమాదం
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- తొలగించాలంటూ డిమాండ్



అనాజ్‌పూర్ రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

ఇబ్రహీంపట్నం రూరల్: రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌తో ఉండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పోల్కంపల్లి నుంచి అనాజ్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ చేశారు. కానీ విస్తరణ సమయంలో మియాబావి దగ్గర రోడ్డుకు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు స్థానచలనం కల్పించడం విద్యుత్ అధికారులు మరిచారు. కనీసం కంచె కూడా ఏర్పాటు చేయలేదు. మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఒకే చోట ఉండటం, అదీ మూలమలుపు వద్ద ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం ఆదమరచినా, వేగంగా దూసుకు వచ్చినా వాటిని ఢీకొట్టే ప్రమాదం ఉందని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. అదే మార్గంలో పశువులు, జీవాలు, కాపలదారుల, రైతులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలే అవకాశం లేకపోలేదన్నారు. అక్కడికి కొది దూరంలోని వ్యవసాయ పొలం వద్ద రోడ్డు ప్రక్కనే పెన్సింగ్‌కు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని, వర్షాకాలంలో మూగజీవాలు ఆ తీగలకు తగిలే ప్రమాదం ఉందని పలువురు వెల్లడించారు. నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఉండటం మంచిది కాదని, సంబంధిత అధికారులు వాటిని తొలగించి, కొద్ది దూరంలో అమర్చి, రక్షణగా కంచె ఏర్పాటు చేయాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కల్లు సరఫరా వాహనం తనిఖీ



కల్లు లారీని తనిఖీ చేసిన ఎక్సైజ్ అధికారులు

శాంపిల్స్ సేకరణ, పరీక్షించిన అధికారులు

కడ్తాల్: కల్లు తరలిస్తున్న వాహనాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. శాంపిల్ సేకరించి, అక్కడే టెస్ట్ నిర్వహించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధి పలు గ్రామల్లో తాటి, ఈత చెట్ల నుంచి గీత కార్మికులు సేకరించిన కల్లును జిల్లాతో పాటు, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సరూర్‌నగర్ ఆదేశాల మేరకు శనివారం శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల పరిధి మైసిగండి గ్రామ సమీపంలో కల్లు తరలిస్తున్న వాహనాలను ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. పరీక్షించి కల్తీ లేదని నిర్ధారించారు. మరి కొన్ని శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. స్వచ్ఛమైన తాటి, ఈత కల్లును మాత్రమే సరఫరా చేయాలని, కల్తీ చేసినట్లు తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్గీకరణ సాధించిన రోజే నిజమైన నివాళి



యాచారం: అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సమితి నాయకులు



ఆమనగల్లు: అమరుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న సమితి నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు/యాచారం: ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ సాధించిన రోజే అమరులకు నిజమైన నివాళి అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేశ్ అన్నారు. వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి చిత్రపటాలకు శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమితి అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ ఆధ్వర్యంలో వర్గీకరణ పోరాటం జరుగుతుందన్నారు. వర్గీకరణ జరిగేంత వరకు మాదిగ, మాదిగ ఉపకులాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, జోగు అంజయ్య, మస్కు యాదగిరి, మల్లేశ్, కావలి గణేశ్, శ్రీనువాస్, అనిల్ కుమార్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు సాధించుకున్నప్పుడే అమర వీరులకు నిజమైన నివాళి అని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు అర్పించిన వారి చిత్రపటాలకు శనివారం సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ కూడలిలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి జిల్లా నాయకుడు మల్లెపోగు మల్లేశ్, మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం, నాయకులు పులికంటి మైసయ్య, యాదయ్య, విజయ్‌చందర్, శివ పాల్గొన్నారు.

4న భూ బాధితులతో జాన్‌వెస్లీ సమీక్ష



యాచారం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఈ నెల 4న మండలంలో పర్యటిస్తారని ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ తెలిపారు. నక్కర్తమేడిపల్లిలో పాదయాత్ర చేపడతారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల ఫార్మాసిటీ భూ బాధితులతో సమీక్ష నిర్వహిస్తారని వెల్లడించారు. సమావేశానికి బాధిత రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ కుసుమ

ఆమనగల్లు: వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సు, బడ్జెట్ ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. శనివారం రైతువేదిక భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు మోదీ ప్రసంగం విన్నారు. అనంతరం వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రైతులు ఏ విధంగా కృషి చేయాలనే అంశంపై లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కుసుమ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ శోభారాణి, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల వ్యవసాయాధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి, రేణుకచక్రవర్తి, శ్రీలత, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

5న లయన్స్‌క్లబ్ జోన్ సమావేశం

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ జోన్ సమావేశం ఈ నెల 5న సిక్కిం రాష్ట్రంలోని గ్యాంగ్‌టక్‌లో నిర్వహిస్తున్నట్లు లయన్ జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, లయన్ ఆమనగల్లు పీఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జోన్ పరిధి ఆమనగల్లు, కందుకూరు, కల్వకుర్తి, బాలాజీనగర్ క్లబ్‌ల సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మాడ్గుల: ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి వారికి పాఠాలు చెప్పారు. ఎంఈఓగా వంశీ, ప్రధానోపాధ్యాయురాలిగా మైత్రిలు వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన చిన్నారులను ఎంఈఓ పాండు అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు షహవార్, విజయ, రమాకిరణ్, కళావతి, మల్లీశ్వర్, సంతోష, జున్ను పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: మండల పరిధి నాగిళ్ల గ్రామం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి వారికి పాఠాలు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలిగా శ్రావ్య, డీఈఓగా రిశిక, ఏంఈఓగా హరిత, ఎంపీడీఓగా యామిని పాఠశాలను పరిశీలించారు. అనంతరం చిన్నారులను మండల విద్యాధికారి సర్దార్ నాయక్ అభినందించారు. ప్రతిభకు గుర్తింపుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఎక్వాయిపల్లిలో..

కడ్తాల్: మండల పరిధి ఎక్వాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎంగా శశి, కలెక్టర్‌గా ధనుష్‌కుమార్, డీఈఓగా సాయి దీప్తి, ఎంఈఓగా వర్షిణి వ్యహరించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు రాజు, ఏఏపీసీ చైర్ పర్సన్ కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: విఠాయిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులు



కడ్తాల్: ఎక్వాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మకత వెలికితీత



ఆమనగల్లు: ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న రాఘవేందర్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: ఎగ్జిబిట్ల పనితీరును ప్రిన్సిపాల్‌కు వివరిస్తున్న విద్యార్థిని

- టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఆమనగల్లు: విద్యార్థుల సృజనాత్మకతకు సైన్స్‌ఫెయిర్లు దోహదపడతాయని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో శనివారం సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు. వాటిపనితీరు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మట్లాడుతూ.. చిన్నారుల్లో సృజనాత్మకత నైపుణ్యం పెంపొందించడంతో.. కొత్తకొత్త ఆవిష్కరణలు వస్తాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మనోవికాసానికి, ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవడానికి సహకరిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, అరబిందో హైస్కూల్ కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి, ట్రస్మా సభ్యులు అల్లాజీగౌడ్, శ్రీరామ్, శివలింగం, మహమ్మద్, నిరంజన్, సుదర్శన్, శ్రీను, వెంకటేశ్, సంజయ్, ఉపాధ్యాయులు నరేశ్, భాస్కర్, హైమావతి, రాధ, సునీత, సౌజన్య, స్వప్న, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: జాతీయ సైన్స్‌డేను పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రం కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. వివిధ అంశాలపై విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనను ప్రిన్సిపాల్ భూపతి, నలమాస సరితలు ప్రారంభించారు. ఆయా ఎగ్జిబిట్ల పనితీరును చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు విస్తరణలో ఓ ఇంటి ముందు భాగాన్ని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

- మార్కింగ్ మేరకు ఇళ్ల కూల్చివేత
- ప్రజల అభ్యంతరంతో విస్తరణ 50 ఫీట్లకు కుదింపు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి మాడ్గుల రోడ్డు సందబావి వరకు రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు బీటీరోడ్డు ఆధునికీకరణ, ఆమనగల్లులో రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో తలకొండపల్లి నుంచి ఆమనగల్లు వరకు రోడ్డు పనులు పూర్తికాగా, పట్టణంలో విస్తరణ పనులు నిలిచిపోయాయి. విస్తరణ పనులు చేపడితే మాడ్గుల రోడ్డులో సుమారు 82 కుటుంబాలకు చెందిన ఇళ్లు కూల్చి వేయాల్సి ఉంటుంది. రోడ్డు విస్తరణలో తాము నష్టపోతామంటూ స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీంతో పనులకు ఆటంకం కలిగింది. ఈ నేపథ్యంలో ఐదు రోజుల క్రితం ప్రాంత ప్రజలతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు. వారి అభిప్రాయం తెలుసుకున్నారు. 60 ఫీట్లు కాకుండా.. 50 ఫీట్లకు విస్తరణ కుదించాలని పలువురు కోరారు. వారి కోరిక మేరకు 50 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నష్టపోయే బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో పట్టణంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో విస్తరణ పనులకు మోక్షం కలిగింది. మార్కింగ్ మేరకు ఇళ్లను కూల్చివేస్తున్నారు.

ప్రకృతి వనం.. అధ్వానం

- కొరవడిన పర్యవేక్షణ
- ఎండిన మొక్కలు, చెత్తాచెదారంతో వాకింగ్ ట్రాక్‌లు



చెత్తాచెదారంతో వాకింగ్ ట్రాక్



ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

కడ్తాల్: గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కరువై కళావిహీనంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామానికో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. విరివిగా మొక్కలు నాటి, నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించింది. కానీ నీరు పట్టేవారు లేక వికృతంగా మారాయి. కడ్తాల్ పట్టణంలో ఎకరన్నరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో మండల ప్రజలు సేద తీరుతుంటారు. ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామం చేస్తుంటారు. అయితే ఏడాది కాలంగా పర్యవేక్షణ లేక మొక్కలు ఎండిపోయాయి. నీరు పట్టేవారు లేక పచ్చదనం కోల్పోయి.. మొదళ్లు దర్శనమిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఫలితంగా ప్రకృతి వనాలు అధ్వానంగా తయారయ్యాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు పర్యవేక్షించి, ప్రకృతి వనాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.